పేదల ముంగిట మెరుగైన వైద్యం!

- దాట్లా దాతృత్వం.. ఎస్ఆర్‌డీ నేతృత్వం...
- ముషీరాబాద్‌లో మరో అధునాతన వైద్యశాల
- వారం రోజుల్లో ప్రారంభానికి సిద్ధం



నిర్మాణం పూర్తి చేసుకున్న విజయ్‌కుమార్ దాట్లా దేషన్ ఆస్పత్రి

ముషీరాబాద్: భోలక్‌పూర్, ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పక్కనే క్షయ వ్యాధి ఆస్పత్రి కూడా ఉంది. ఈ క్షయ వ్యాధి ఆస్పత్రి పురాతన భవనంలో కొన సాగుతూ రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. కొంత కాలం ఆ స్థలం ఖాళీగా ఉండటంతో నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించే సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఈ ఖాళీ స్థలంలో నూతన ఆస్పత్రి నిర్మిస్తే పేదలకు మరింత వైద్యం అందుబాటులోకి రానుందని భావించారు.

- బయోలాజికల్ ఈ–లిమిటెడ్ (బీఈ కంపెనీ) అధినేత విజయ్‌కుమార్ దాట్లా ఇటీవల మరణించడంతో ఆయన పేరుమీద ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ ఫౌండేషన్ పేరు మీద పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.
- దీంతో శ్రీనివాస్‌రెడ్డి దాట్ల విజయ్‌కుమార్ కూతురు మహిళా దాట్లాను కలిసి ముషీరాబాద్‌లోని ప్రభుత్వ స్థలంలో ఆస్పత్రి నిర్మాణానికి చేయూతనందించాలని కోరగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సీఎస్ఆర్) నిధులతో వారు దానికి అంగీకరించారు.
- ఈ స్థలం రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు చెందడంతో అప్పటి హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును కలిసి పరిస్థితిని వివరించారు.
- ఒక ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సాధ్యం కాదని చెప్పడంతో పాటు ఆస్పత్రి నిర్మించాలంటే పాత బస్తీలో అవసరం ఉందని అక్కడ నిర్మించాలని విజయ్‌కుమార్ దాట్లా ఫౌండేషన్‌ను కోరారు.
- అందుకు అంగీకరించని ఫౌండేషన్ సభ్యులు రెండు నెలల పాటు వేచి చూశారు. చివరకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌లు హరీష్ రావును కలిసి ఆస్పత్రి నిర్మాణానికి అంగీకరించవలసిందిగా కోరడంతో మంత్రి దానికి అంగీకరించారు.
- ప్రభుత్వం స్థలాన్ని మాత్రమే ఇవ్వగా దానికి కావాల్సిన సుమారు రూ. 2.5 కోట్ల డబ్బును దాట్లా ఫౌండేషన్ ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఖర్చు చేసి ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేసింది. సంవత్సరంన్నర పాటు నిర్మాణం కొనసాగి అన్ని వసతులతో నిర్మాణాన్ని పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉంది.
- హైదరాబాద్ జిల్లా వైద్య శాఖ ప్లాన్ మేరకు గ్రౌండ్ ప్లస్ ఫస్ట్ ఫ్లోర్‌ను పది వేల ఎస్ఎఫ్‌టీతో నిర్మించారు.
- విశాలమైన డాక్టర్స్ రూమ్‌లు, మెడికల్ షాపు, ఆపరేషన్ థియేటర్, పది పడకల గదులు వంటివి ఇందులో నిర్మించారు.
- రూ. 9 లక్షల విలువైన మెటీరియల్‌ను దాట్లా ఫౌండేషన్ వారే అందించారు.

ముషీరాబాద్ ప్రధాన రహదారిలో ముషీరాబాద్ మెట్రో రైల్వే స్టేషన్‌ను ఆనుకొని అధునాతన సౌకర్యాలతో సుమారు రూ. 2.5 కోట్ల వ్యయంతో నిర్మించిన పది పడకల ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. దీంతో ముషీరాబాద్, రాంనగర్, భోలక్‌పూర్ డివిజన్‌లలోని పేద ప్రజలకు అధునాతన వైద్యం మరింత చేరువ కానుంది. వారం పది రోజుల్లో ఈ ఆస్పత్రి ప్రారంభం కానుంది.

పేదలకు మంచి వైద్యం అందాలనే...



ముషీరాబాద్, భోలక్‌పూర్, రాంనగర్ తదితర ప్రాంతాలలో మురికి వాడలు, అందులో నివసించే పేదలు అధికంగా ఉంటున్నారు. సమీపంలో గాంధీ, ఇతర ఆస్పత్రులు ఉన్నా మరింత మెరుగైన వైద్యం అందాలంటే ఓ అధునాతనమైన ఆస్పత్రి అవసరం ఉంది. ఇక్కడ ఖాళీ స్థలం ఉన్న విషయాన్ని తెలుసుకొని మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి దాట్లా ఫౌండేషన్ వారిని కలిసి ఈ నిర్మాణానికి కృషి చేశాము. అడగగానే స్థలం ఇచ్చిన ప్రభుత్వానికి, రెండున్నర కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన దాట్లా ఫౌండేషన్‌కు ఆ ఆస్పత్రి నిర్మాణానికి చేయూతనందించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. గాంధీ ఆస్పత్రిలో రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ఆస్పత్రిలో సాయంత్రం వేళల్లో ఓపీలు చూసే అవకాశం కూడా ఉంది.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఆర్‌టీ డైరెక్టర్

నేడు మాతాకుసుమ కుమారి జయంతి



కుసుమహరనాథుల మూలవిరాట్

నల్లకుంట: నల్లకుంట ప్రశాంత్‌నగర్‌లోని కుసుమహరనాథ ఆశ్రమంలో ఆదివారం మాతాకుసుమకుమారి 153వ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆశ్రమం పాలక మండలి సభ్యులు తెలిపారు. ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అర్ధ ఏకాహం, ప్రత్యేక పూజలు, భక్తులచే భజన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందని చెప్పారు.

గుర్తు తెలియన వ్యక్తి మృతి



అంబర్‌పేట: గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... 40 సంవత్సరాల వయస్సున్న ఓ వ్యక్తి మృతదేహం ముసారంబాగ్ బ్రిడ్జ్ సమీపంలోని దర్బార్ మైసమ్మ ఆలయం పక్కన పడి ఉన్నట్లు శనివారం పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి పూజ



ప్రత్యేక పూజల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: అయ్యప్ప మాల దీక్ష పవిత్రమైనదని, మాలాధరణ ఆధ్యాత్మిక భావన పెంపొందిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బాగ్ అంబర్‌పేటలోని గురువయ్యార్ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులతో కలిసి స్వామి వారికి పూజాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత 20 సంవత్సరాలుగా తాను అయ్యప్ప మహాపడి పూజాను నిర్వహిస్తున్నానని తెలిపారు. ఆదివారం నారాయణగూడ కేశవ్ మెమోరియల్ కళాశాల ఆవరణలో అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు, హాజరై స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, స్థానిక నాయకులు గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌కు అభినందన



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను తెలుగు బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోర్రిగల శ్రీధర్, ఐ.రవిశంకర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఘనంగా సత్కరించింది. దళిత ముద్దుబిడ్డ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా మొదటిసారి ఎంపిక కావడం పట్ల వారు హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్‌కు పూల బోకే అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

23న సాయిశృతి మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవం

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ 20వ వార్షికోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి తెలిపారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. యామిని, నందిని ఈవెంట్ మేనేజర్లుగా వ్యవహరించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర, దైవదర్శన్ సీనియర్ యాంకర్ విజయ దుర్గ, ప్రముఖ సంగీత విద్వాంసురాలు ప్రఖ్య జయశ్రీ, ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి జి. తిరుపతయ్య హాజరవుతారన్నారు. ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి సారథ్యంలో సంగీత విద్యాలయం విద్యార్థులచే శాస్త్రీయ, భక్తి సంగీత కచరీ ఉంటుందని వసుధామూర్తి వివరించారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షురాలు నీరాకిషోర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఉద్యమకారుల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించిందని తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షురాలు నీరాకిషోర్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో గత తొమ్మిది సంవత్సరాల నియంత పాలన ఈ ఎన్నికల్లో తొలగిపోవడం సంతోషకరమైన విషయం అన్నారు. గత నెల రోజుల క్రితం ప్రజా సమితి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో మాట్లాడడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు కూడా రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని నమ్మకం లేదు అని వివరించారన్నారు. ప్రజా సమితితో పాటు తెలంగాణ ఉద్యమకారులు సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పూర్తి మద్దతు ఇస్తామని వారికి విశ్వసం కల్పించామని తెలిపారు. ఆ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 30 రోజుల్లో ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు కోసం ఒక ప్రత్యేక కమిటీ వేస్తామని హామీ ఇచ్చారని తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల పరిష్కారం కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 30 రోజుల్లో తెలంగాణ ఉదద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిటీ వేసి వారి డిమాండ్లను పరిష్కరించడానికి చర్యలు తీసుకోకపోతే ఉద్యమకారుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కొండస్వామి, ప్రధాన కార్యదర్శి సనావుల్లా ప్రజా సంఘాల ఉద్యమకారుల నాయకులు కోళ్ల జనార్ధన్, సాజిదా సికందర్, అశోక్‌కుమార్, శ్రీహరి, రామిరెడ్డి, దయానంద్, లక్ష్మయ్య, దేశ్పాండే, రాందాస్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేతపై కోర్టు తాత్కాలిక స్టేపై హర్షాతిరేకాలు



బస్తీవాసులకు స్వీట్లు తినిపిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీలో 23 దళిత, పేద కుటుంబాల ఇళ్లను కూల్చేందుకు అధికారులు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ బస్తీవాసులు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు శనివారం తాత్కాలిక స్టే ఇచ్చిందని బస్తీ అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు ఎస్. ఎల్లం, ఎంబి కృష్ణ తెలిపారు. హైకోర్టు డబుల్ బెంచ్ జడ్జిలు స్టే ఇవ్వడం పట్ల వారు కోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ బస్తీకి చేరుకుని బస్తీ వాసులతో సంబరాల్లో పాల్గొన్నారు. బస్తీ వాసులకు ఆమె స్వీట్లు తినిపించి సంతోషం పంచుకున్నారు. జాన్, రాజయ్య, రాజు, నందు, నరేష్, ఆనంద్‌రావు, కవిత, భారతి, సునీత, పూజ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక యువతకు మ్యాజిక్‌లో శిక్షణ



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న మ్యాజిక్ సర్కిల్ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: ఇండియా–శ్రీలంక దేశాలు, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఔత్సాహికులైన యువతకు మ్యాజిక్ శిక్షణ, ప్రదర్శనల నిర్వహణ ఇచ్చేందుకు శ్రీలంక మ్యాజిక్ సర్కిల్, హైదరాబాద్ మ్యాజిక్ సర్కిల్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు శనివారం బషీరాబాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీలంక మ్యాజిక్ సర్కిల్ అధ్యక్షుడు రోహన్ యశేఖర, హైదరాబాద్ మ్యాజిక్ సర్కిల్ అధ్యక్షుడు టి.విజయ్ కాంత్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత్, శ్రీలంక దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింతగా మెరుగు పడటానికి ఈ మ్యాజిక్ శిక్షణ కార్యక్రమాలు ఎంతోగానో ఉపయోగ పడతాయన్నారు. త్వరలో తెలంగాణలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన యువతకు శ్రీలంక దేశంలో కూడా శిక్షణ అందిస్తామని తెలిపారు. తెలంగాణ అమెరికన్ తెలుగు సంఘం (టీటీఏ) అధ్యక్షుడు వంశీరెడ్డి, రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా మాదిగలకు సముచిత స్థానం కల్పించాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 9 ఏళ్ల గడిచినా రాష్ట్రంలో 60 లక్షల జనాభా కలిగిన అతిపెద్ద మాదిగ, మాదిగ ఉప కులాలకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా మాదిగలకు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు మంచాల యాదగిరి, జీడీ నర్సింహా, సలహాదారు గెలువయ్య, హైదరాబాద్ అధ్యక్షుడు భీమ్, ఉపాధ్యక్షులు బూస్ పాక నర్సింహా, ఎమ్మెస్ఎఫ్ కన్వీనర్లు దర్శనం జాన్, ఈశెంటి విజయ్, దండోరా యువసేన అధ్యక్షుడు తిక్కన నవీన్ రాజ్, ఎమ్మెస్సెఫ్ నేతలు సాయి కిరణ్, రంజిత్, వెంకన్న, వెంకట్, రమేష్, కిరణ్, నవీన్ రాజ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు ప్రకటన హర్షణీయం

పంజగుట్ట: అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుప్పాల కృష్ణ కుమార్, హన్మండ్ల భాస్కర్ తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు అంశాన్ని చేర్చి అధికారంలోకి రాగానే పాత పెన్షన్ విధానం తీసుకొస్తామని చేర్చడంతో సుమారుగా లక్ష 70 వేల మంది సీపీఎస్ ఉద్యోగులు ఎంతో హర్షం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. 2004 తరువాత నియామకం అయిన వారికి పాత పెన్షన్ విధానం తొలగించి సీపీఎస్ విధానం అమలు చేశారని, అప్పటి నుంచి ఉద్యోగులు ఎంతో మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని కోరారు.

విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

పంజగుట్ట: ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగించకుండా నిమ్స్ అభివృద్ధి పేరుతో అన్ని మార్గాలు మూసి వేసి విద్యార్థులకు ఇబ్బంది పెట్టడం సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పేర్కొన్నారు. ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే అన్ని మార్గాలు మూసివేసి కేవలం నిమ్స్ ఆస్పత్రి లోపలినుంచి బాలాపూర బస్తీ మీదుగా పాఠశాలకు చేరుకునేలా ఒక గేటు ఏర్పాటు చేయడంతో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు విజయారెడ్డిని సంప్రదించారు. దీంతో ఆమె డిప్యూటీ డీఈఓ శామ్యూల్‌రాజ్‌తో కలిసి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఈఈని సంప్రదించగా ఆయన పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను కలవగా తాను దారులు మూసివేయాలని ఎప్పుడూ చెప్పలేదని, వెంటనే ఈఈని సంప్రదించి దారులు ఎందుకు మూసివేశారని ప్రశ్నించి నూతన పాఠశాల నిర్మించి పిల్లల్ని తరలించే వరకు అన్ని దారులు తెరవాలని ఆదేశించారు.

నోరూరించే కర్ణాటక రుచులు



కర్ణాటక ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: జిహ్వ చాపల్యాన్ని తీర్చేందుకు నోరూరించే కర్ణాటక రుచులతో కాచిగూడ లింగంపల్లిలోని నృపతుంగ స్కూల్ ప్రాంగణంలో కర్ణాటక శిక్షణ సమితి ఆధ్వర్యంలో 'కర్ణాటక ఫుడ్ ఫెస్టివల్' కొలువుతీరింది. ఫెస్టివల్‌ను శనివారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఫుడ్ ఫెస్టివల్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కర్ణాటక శిక్షణ సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ జడ్జి సుదేంద్ర కులకర్ణి, కార్యదర్శి ముకుంద్ కులకర్ణి, నర్సింహమూర్తి, సుదీంద్ర కులకర్ణి, రాజేంద్ర దేశాయ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, శ్యామ్‌రావు, బి.భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను దోచుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం



కూనంనేనికి శుభాకాంక్షలు చెబుతున్న ఏఐటీయూసీ నేతలు

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి
- సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

హిమాయత్‌నగర్: నియంతృత్వ కేసీఆర్ పాలనలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల శ్రమను దోచుకున్నారని, అసంఘటిత కార్మికుల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో దగాపడ్డ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ట్రేడ్ యూనియన్ నాయకులూ కూనంనేని సాంబశివరావుకు సన్మాన సభ ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, కె.ఏసురత్నం, కార్యదర్శులు ఎం.నరసింహ, బి.వెంకటేశం, ఓరుగంటి యాదయ్య తదితరులు కూనంనేనికి శాలువా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు: ఆప్



వైద్య సేవలు చేస్తున్న డాక్టర్లు

లిబర్టీ: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతాయని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. సీసన్స్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ హరిచరణ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ సుధాకర్ ప్రారంభించి మాట్లాడుతూ... ఆప్ పాలిత రాష్ట్రాల్లో అన్ని వర్గాల ప్రజలకు విద్య, విద్యుత్, నీరుతో పాటు వైద్యం కూడా ఉచితంగా అందజేస్తున్నారన్నారు. మధుమేహం వంటి దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య సహాయం పది లక్షలకు పెంచడం అభినందనీయమన్నారు. మొత్తం వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందజేయాలని ఆయన కోరారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిగా సభ్యులు బుర్ర రాముగౌడ్, పుట్ట పాండురంగయ్య, అధికార ప్రతినిధులు ఆఫస, పరీక్షణ్, జావీద్, షరీఫ్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమజిల్లోజు, నర్సింగ్ యమునాగౌడ్, రాకేష్‌సింగ్, కొడంగల్ శ్రీనివాస్, శ్రీకాంత్, జైసింగ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు



కాచిగూడ: మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, గ్రేటర్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్‌ల ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్నూరుకాపుల అభివృద్ధి, సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు.

ఘనంగా గ్యార్వీ వేడుకలు



అన్నదానం చేస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్

కాచిగూడ: కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద రషీదా బేగం ఆధ్వర్యంలో శనివారం గ్యార్వీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ... పవిత్రంగా భావించే గ్యార్వీ మాసంలో విరివిగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తనకున్న దాంట్లో ఎంతోకొంత సేవాకార్యక్రమాలకు వ్యయం చేయాలని కోరారు. బీజేపీ నేతలు కేసరి నర్సింగ్ యాదవ్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

లిబర్టీ: భారత దేశ సైనిక శక్తి గొప్పదని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకట రాజేశ్వరరావు అన్నారు. దేశ రక్షణ కోసం ప్రజల కోసం సైనికులు నిర్వహిస్తున్న పాత్ర గొప్పదని పేర్కొన్నారు. కార్గిల్‌లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించిన నేపథ్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో విజయ్ దివస్ సభను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... అనేక సందర్భాలలో సైనికులు పాకిస్తాన్ కుట్రలను తిప్పికొట్టి దేశ రక్షణ.. ప్రజలకు భద్రత కల్పించడం ... దేశ సమైక్యత సమగ్రతను కాపాడటంలో ప్రధాన భూమిక పోషించారని గుర్తు చేశారు. 1971లో డిసెంబర్ 3వ తేదీన రెండో పాక్ యుద్ధం ప్రారంభమై 13 రోజులు అనంతరం డిసెంబర్ 16వ తేదీన పాకిస్తాన్ తోకముడిచి ఓటమిని అంగీకరించడంతో భారత విజయ పతాకం రెపరెపలాడిందని అన్నారు. భారత సైనికులు పాల్గొని ఎదుర్కొని విజయం సాధించారని అన్నారు. సమావేశంలో పి.వి.శ్రీనివాస్‌రావు, సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి సహస్ర కలశాభిషేకం



సహస్ర కలశాభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సహస్రకలశాభిషేక వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్. లావణ్య వేడుకల్లో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 17 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో నెల రోజుల పాటు స్వామిసన్నిధిలో అభిషేకాలు, కల్యాణ మహోత్సవాలు నిర్వహించరు. ఇందులో భాగంగానే ధనుర్మాసోత్సవానికి ముందు సహస్రకలశాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.